వ్యవసాయ మార్కెట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

'ఉచిత ఇసుక' అమలులో విఫలం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ - కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంలో రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలను నమ్మబలికిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక మాటలే మాట్లాడకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని విమర్శించారు. మాటల్లో చెప్పిన విధంగా ఆచరణలో ఏమీ జరగడం లేదని ఎద్దేవా చేశారు. ఖరీదైన ఇసుకైనా కొనడానికి వెళితే సినిమా టికెట్ల కంటే అధ్వానంగా రాత్రి 3 గంటలకు లేచి బుకింగ్ కోసం పోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఖరీదైన ఇసుక ఉండడంతో నిర్మాణ పనులన్నీ నత్తనడకన సాగాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక తక్కువ ధరకు దొరుకుతుంది.. కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టవచ్చని భావించిన ప్రజలకు నిరాశే మిగిలిందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఆ కుటుంబాలు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. కార్మిక కుటుంబాలు అర్ధాకలితో జీవిస్తున్నా ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఒకవైపు తుంగభద్ర, మరొకవైపు హంద్రీనది ఉన్నప్పటికీ ఇసుక మాత్రం ట్రాక్టర్ రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలుకుతోందని తెలిపారు. ఇలా అయితే ఇళ్ల నిర్మాణం ఎలా చేసుకోవాలని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. ఇదే 2014-19 మధ్యలో ఒక ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2 వేలకే వచ్చేదని తెలిపారు. ఇసుక రీచ్ పాయింట్లు చాలా దూరంగా ఉండడంతో రవాణా చార్జీలు పెరుగుతున్నాయని చెప్పారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

అందుకోసం ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక ఇసుక రీచ్ పాయింట్‌ను పెట్టడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఇసుక రవాణాను అరికట్టాలని, ఇసుక మాఫియాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ... ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 100 రోజుల మంచి పాలన అని స్టిక్కర్లు వేసి మరీ ప్రచారం చేస్తోందని, మంచి పాలన అంటే ఇసుకను బంగారంలో అమ్మడమేనా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా, ప్రజా సమస్యలు పక్కదోవ పట్టించేలా పాలకుల చర్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు ధరల పెరుగుదలతో సతమతమవుతున్న కార్మికులకు పని దొరకకపోవడంతో జీవనం గుదిబండంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నిరసన వద్దకు వచ్చిన డిఆర్ఒకు నాయకులు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు అంజిబాబు, ఆనంద్ బాబు, నగేష్, నగర నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, అబ్దుల్లా, షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. ఓర్వకల్లు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, మండల నాయకులు ఎస్.మధుసూదన్, వి.సుధాకర్, పార్టీ సభ్యులు మాసుం బాష, భాస్కర్ మాట్లాడారు. శాలి బాష, అక్బర్ బాష, ఇస్మాయిల్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** సిపిఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు, నాయకులు, కార్మికులు రాజు, లాలు బాష, బడేసాబ్, మాణిక్యం, జైపాల్, రాఘవేంద్ర, ఎం.రాజు, రమేష్, సాలె సాబ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన వేరుశనగ రైతులను ఆదుకోవాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకటేశులు మాట్లాడారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి, వేరుశనగ పంట ధరలు రోజురోజుకు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అంతకుముందు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సహాయ కార్యదర్శి హనుమంతు నాయకత్వంలో మార్కెట్ యార్డులో పర్యటించారు. పత్తి పంట ధరలు గతనెలలో క్వింటాకు రూ.8 వేలు ఉండగా, ఇప్పుడు రూ.5 వేల నుంచి రూ.7 వేలు మాత్రమే ఉందని వాపోయారు. వేరుశనగ పంట ధరలు రూ.4 వేల నుంచి రూ.6 వేలు ఉందని తెలిపారు. కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదని మండిపడ్డారు. సిసిఐ ద్వారా పత్తి పంటను కొనుగోలు చేయడం లేదన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా కూడా వేరుశనగ పంటను కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. అకాల వర్షాలు కురిసి కొంతమంది రైతుల పంటలు తడిసి ముద్దయ్యాయని తెలిపారు. వేరుశనగ పంట నీళ్లలో కొట్టుకుపోయిందని చెప్పారు. రైతులకు పరిహారం అందించాలని కార్యాలయంలో రెండు గంటల పాటు బైఠాయించి నిరసన చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శి శాంత కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన హామీ మేరకు ధర్నాను విరమించారు. రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, జిల్లా నాయకులు బాష, వెంకటేశులు, ఈరన్న, రంగస్వామి, రవి, తిక్కన, హనుమంతురెడ్డి, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి దస్తగిరి, బాష, రహీంబాష పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సెలవుల్లో తరగతులు నిర్వహించే

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ఆర్ఐఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఐఒ గురువయ్య శెట్టికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని, చాలా ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా ప్రత్యేక తరగతుల పేరుతో కళాశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడి గురవుతారని, ప్రతి ప్రయివేట్ కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ బోర్డు ఇచ్చిన ఆదేశాలు అమలు జరిగే విధంగా చూడాలన్నారు. తరగతులు నిర్వహిస్తే వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, జిల్లా కమిటీ సభ్యులు అంజి, నగర నాయకులు ఆర్యన్ పాల్గొన్నారు.

దేవరగట్టు బన్ని ఉత్సవాలను

ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 12న జరగబోయే దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాష ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో దేవరగట్టు బన్ని ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట, దేవరగట్టు గ్రామాల ప్రజలు బన్ని ఉత్సవాలను ఎలాంటి సమస్యలూ రాకుండా పండగలాగా జరుపుకోవాలని సూచించారు. ఎవరూ గాయపడడం కానీ, ఇబ్బంది పడడం కానీ జరగకుండా సంతోషకరమైన వాతావరణంలో ఉత్సవం జరుపుకోవాలని నాలుగు గ్రామాల తరపున హాజరైన సభ్యులకు సూచించారు. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం తరపు నుంచి వసతుల కల్పన తదితర అంశాలపై ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిటీ సభ్యుల కోరిక మేరకు సుమారు 2 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే విధంగా వాటర్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలూ లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సత్వర వైద్యసేవల కోసం అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ కలిగిన 4 అంబులెన్సులు, తాత్కాలికంగా 20 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని నియమించాలని, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. అనంతరం జెసి డాక్టర్ బి.నవ్య మాట్లాడారు. దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో భాగంగా సంప్రదాయం పేరుతో కొట్టుకోకుండా, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని జరుపుకొని ప్రజలకు ఆనందాన్ని కలిగించే విధంగా ఉండాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా నాలుగు గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించుకుని అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డిఆర్ఒ చిరంజీవి, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి పాల్గొన్నారు.

దేవరగట్టు బన్ని ఉత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

పింఛన్ల పంపిణీలో జిల్లా అగ్రస్థానం

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో కర్నూలు జిల్లా వరుసగా మూడు నెలలు అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సేవా తత్పరత, మానవతా దృక్పథంతో అవసరం ఉన్న వారికి పింఛన్లను పంపిణీ చేసిన 15 మంది పింఛను పంపిణీ అధికారులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేసిన డిఆర్‌డిఎ పీడీ సలీం బాషను కలెక్టర్ సన్మానించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పీడీని సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

కిలాడీ దొంగల అరెస్టు

- భారీగా నగలు, నగదు స్వాధీనం
- రిమాండుకు తరలించిన బెళగల్ పోలీసులు

ప్రజాశక్తి - సిబెళగల్

మాట్లాడుతున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

ఒక ఊరు, ఒకింట్లో కాదు.. ఏకంగా ఆరు ఊళ్లల్లో, పది ఇళ్లలో ఏడాది పాటు తరచూ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా, కళ్లుగప్పి జనాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు. అలాంటి ముగ్గురు కిలాడీ దొంగలను బెళగల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మండలంలోని కంబదహాల్, కొండాపురం, మారందొడ్డి, తిమ్మందొడ్డి గ్రామాల్లోనే కాకుండా గూడూరు మండలం, పట్టణ పరిసరాలు, కోడుమూరు మండలం పులకుర్తిలో ఇళ్ల దొంగతనాలు, రంగాపురంలో విద్యుత్ మోటార్ వంటివి దొంగతనం చేశారు. విలువైన ఆభరణాలు, నగదు వంటివి ఎత్తుకెళ్లగా ఏడాది పాటుగా పోలీసులుకు సవాలుగా మారింది. బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి ఈ కేసులను సవాలుగా తీసుకుని సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. గూడూరు పట్టణానికి చెందిన కుక్కల రామాంజినేయులు, బెళగల్ మండలం మారందొడ్డికి చెందిన బోయ శ్రీనివాసులు, కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన బోయ వేణుగోపాల్‌ను బెళగల్‌లోని కోటారుమిట్ట వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారు నడుపుతున్న రెండు పల్సర్, ఒక షైన్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా రూ.4.75 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను, రూ.1.25 లక్షల నగదును వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు రేంజ్ డీఎస్పీ, కోడుమూరు సిఐ ఆదేశాల మేరకు శుక్రవారం బెళగల్ పోలీసు స్టేషన్‌లో హాజరుపరచి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారం

- ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం క్రిష్ణగిరిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ విశ్వమోహన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి వెంకటరామిరెడ్డి, జడ్‌పిటిసి కెఇ.సుభాషిని హాజరయ్యారు. మొదటిగా వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వెంకటరామిరెడ్డి మాట్లాడారు. సర్పంచులు, ఎంపిటిసిలు లేవనెత్తిన అంశాలపై అజెండాలో పొందుపరిచి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జడ్‌పిటిసి సుభాషిని మాట్లాడుతూ... గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, ఉపాధి హామీ చట్టం కింద పతి ఒక్కరికీ పనులు కల్పించి వలసలను నివారించాలని అధికారులను ఆదేశించారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి

ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

- మామూళ్ల కోసం దాడులు చేస్తున్న వైసిపి నాయకులు
- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలోని నిరుద్యోగ యుతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, ఇప్పటికీ వైసిపి శ్రేణులు మామూళ్ల కోసం సంబంధిత కాంట్రాక్టర్లపై దౌర్జన్యాలు కొనసాగిస్తూ, దాడులకు పాల్పడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, నాగరాజు యాదవ్, ఎస్.షేక్షావలీ, హనుమంతరావు చౌదరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అనుచరులు రెన్యూ విండ్ పవర్ గ్రీన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించిన కార్యాలయాలపై దాడులకు పూనుకోవడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. కాంట్రాక్టర్లు వైసిపి ఎమ్మెల్యే అనుచరులు అడిగిన మేరకు లంచాలు ఇవ్వడం లేదని ఆలూరుకు సమీపంలో ఉన్న విండ్ కంపెనీ కార్యాలయం, ఆస్పరి మండలం జొహరాపురం గ్రామం సమీపంలోని కార్యాలయం, దేవనకొండ మండలం జిల్లెలబుడకల గ్రామ సమీపంలోని కార్యాలయంపై దాడులు చేసి, ఫర్నీచర్, కంప్యూటర్లు, కార్యాలయాల అద్దాలను ధ్వంసం చేశారని తెలిపారు. సంబంధిత ప్రాజెక్టు సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశారని, అధికారం కోల్పోయినా వైసిపి నాయకులకు బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. వైసిపి అధ్యక్షులు జగన్‌రెడ్డి అనుసరించిన అక్రమ, రౌడీయిజం, గూండాయిజం మార్గాల్లోనే వెళ్లాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారన్న విషయాన్ని మర్చిపోవద్దని, సంఘ వ్యతిరేకులను అణిచివేసేందుకు చంద్రబాబు నాయుడు ఎంతటికైనా సిద్ధమేనని హెచ్చరించారు. ఈ నెల 12 నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ విధానం అమలులోకి వస్తోందని, నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకే ఇవ్వబోతున్నారని తెలిపారు. నగదు రూపంలో కాకుండా బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరగనున్నాయని చెప్పారు. జగన్ త్వరలోనే పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం కానుందని, జిల్లాలో ఈసారి ఎక్కువశాతం సభ్యత్వాలు చేసి, రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. గతంలో చంద్రబాబు చేసిన కార్యక్రమాలకు అండగా నిలిచిన వారికి, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్‌కు తోడుగా పనిచేసిన వారికి తప్పక న్యాయం జరుగుతుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

టమోటా 100 కిలోలు రూ.6 వేలు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా కిలో రూ.60 ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం టమోటా మార్కెట్‌కు 550 క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ కార్నోలీస్ తెలిపారు. వ్యాపారులు పత్తికొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కొత్తగూడెం, కరీంనగర్, మహారాష్ట్ర వంటి మహా నగరాలకు టమోటాను సరఫరా చేస్తున్నారు. గరిష్ట ధర రూ.6 వేలు, మధ్య ధర రూ.4 వేలు, కనిష్ట ధర రూ.3 వేలతో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో టమోటా రూ.6 వేలు ధర పలకడం రికార్డు స్థాయిలో నమోదయింది.

కర్నూలులోనే హైకోర్టు ఏర్పాటు చేయాలి

- వైసిపి లీగల్ సెల్ నాయకులు ప్రభాకర్, సువర్ణరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

కర్నూలులోనే రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేయాలని వైసిపి లీగల్ సెల్ నాయకులు ఎం.ప్రభాకర్, పి.సువర్ణ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు వైసిపి లీగల్ జిల్లా అధ్యక్షులు పి.సువర్ణ రెడ్డి, కర్నూలు జోనల్ ఇన్‌ఛార్జీ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి హేమంత్ రెడ్డి, ఇతర నాయకులు షాషావలీ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలులోనే ప్రిన్సిపల్ హైకోర్టును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే హెచ్‌ఆర్‌సి, లోకాయుక్త, వక్ఫ్ బోర్డ్, ఎపిఎస్ఈఆర్‌సి కార్యాలయాలను కర్నూలులో కొనసాగిస్తూ అసెంబ్లీలో ప్రకటన చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఏర్పాటు చేసిన యూనివర్సిటీని కూడా ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సూర్యనారాయణ ఆలయంలో

రెండోరోజూ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు నగరంలోని శ్రీసూర్య నారాయణ స్వామి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండో రోజూ కొనసాగాయి. ప్రాతఃకాలంలో శ్రీమహాగౌరీ అమ్మవారికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ తెలిపారు. మహాగౌరీ అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి మండపారాధన దేవి, ఖడ్గమాల, లలితా సహస్రనామాలతో అర్చన చేసినట్లు చెప్పారు. శుక్రవారం సందర్భంగా రాహుకాల పూజ నిర్వహించామని తెలిపారు. అనంతరం నవ చండి హోమంలో భాగంగా చండీహోమం చేపట్టినట్లు చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిసేదాకా నిర్వహిస్తామన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

జిల్లా హిందూస్థాన్ ఉద్యోగ్ వ్యాపార్ మండల్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



కర్నూలు జిల్లా హిందూస్థాన్ ఉద్యోగ్ వ్యాపార్ మండల కమిటీని శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు ముర్షాద్ పీర్ ఖాద్రీ ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ షోయబుద్దీన్ ఖాద్రీని, ప్రధాన కార్యదర్శిగా చంద్ర కళాబాయిని ఎంపిక చేశామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా సుంకన్న, షేక్ ఖాజా, కార్యదర్శిగా షేక్ సలీం, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ నస్రుల్లాను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సోయబుద్దీన్ ఖాద్రీ మాట్లాడుతూ... జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలివ్వాలని సిఐటియు ఓల్డ్ సిటీ నగర నాయకులు విజయ్ డిమాండ్ చేశారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ ముందు శుక్రవారం సిఐటియు నాయకులు, క్లాప్ డ్రైవర్లు బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతం ఇవ్వాలని స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేసి ఇచ్చినా అధికారులకు చీమకుట్టినట్టు లేదని తెలిపారు. తీర్మానం చేసి నెల అవుతున్నా ఇంతవరకు క్లాప్ డ్రైవర్ల జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. క్లాప్ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, ఒకవైపు కుటుంబ సమస్యలు, మరోవైపు వారి పిల్లల స్కూల్ ఫీజులు కట్టుకోలేక అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

7 నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

- జిల్లా తపాలా పర్యవేక్షకులు జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాలా శాఖ జాతీయ తపాల వారోత్సవాలను ఈనెల 7 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా తపాలా పర్యవేక్షకులు జి.జనార్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. తపాల వారోత్సవాల సందర్భంగా ఈనెల 7న మెయిల్స్ బుకింగ్, కస్టమర్లకు బిఎన్‌పిఎల్ అధిక మొత్తంలో పోస్టల్ మెయిల్స్ సర్వీస్‌లను ఉపయోగించుకునే వారిని సత్కరించే కార్యక్రమం ఉంటుందన్నారు. 8న పాఠశాల విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన, క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న ప్రపంచ తపాలా దినోత్సవంలో భాగంగా మారథాన్ నడక, మొక్కలు నాటే ఉంటుందని చెప్పారు. 10న అంత్యోదయ దివస్ ప్రత్యేక ఆధారం నమోదు, సవరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఉత్పత్తులను నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న సుకన్య సమృద్ధి ఖాతాలు, పోస్టాఫీస్ వారు అందించే ఇతర చిన్న మొత్తాల పొదుపు ఖాతాలు పిఎల్ఐ, ఆర్‌బిఎల్ఐ మేళాలో ప్రతి పోస్టాఫీస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేతనాల తగ్గింపు గురించి అడిగాం..

దాడులకు పాల్పడలేదు

- ఆలూరు అభివృద్ధికి కృషి - ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నియోజకవర్గంలో ఉన్న పవన విద్యుత్ ప్రాజెక్టులో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు తగ్గించి ఇస్తున్నారని ఆ ప్రాజెక్టు ఏజెన్సీ ప్రతినిధి మంజునాథను ప్రశ్నించారు తప్ప తన అనుచరులు ఎలాంటి దాడులకు పాల్పడలేదని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. గురువారం జరిగిన ఘటనపై పోలీసులు నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. శుక్రవారం దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, నియోజకవర్గంలో దౌర్జన్యాలకు పాల్పడేది ఎవరనేది ప్రజలకు తెలుసని అన్నారు. ఆలూరు నియోజకవర్గంలో గుంతకల్లు ఎమ్మెల్యేగా ఉన్న గుమ్మనూరు జయరామ్, ఆయన గ్రూపు పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. పవన విద్యుత్ ప్రాజెక్టు సిబ్బందికి ఏజెన్సీ ద్వారా ఒక్కో కార్మికునికి రూ.25 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేలలోపు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారని తెలిపారు. కార్యాలయాలు, సిబ్బందిపై టిడిపికి చెందిన వారే దాడులకు పాల్పడి తమ అనుచరులపై అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. పవన విద్యుత్ ప్రాజెక్టులో తమ కార్యకర్తలకు కూడా ఉద్యోగాలు కావాలని ప్రాజెక్టు ప్రతినిధి మంజునాథను అడిగింది వాస్తవమని తెలిపారు. మరి ఎలాంటి దౌర్జన్యాలకు తమ కార్యకర్తలు పాల్పడలేదన్నారు. పోలీసులు నిజాలను తేల్చి కేసులు నమోదు చేయాలన్నారు. రౌడీలను వెంటబెట్టుకొని తిరిగేది ఎవరో ఆలూరు నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి ప్రతిపాదనలు

- ఎంపిపి గిరిజమ్మ

మాట్లాడుతున్న ఎంపిపి గిరిజమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులపై నాయకులు, అధికారులు సమన్వయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపిపి వై.గిరిజమ్మ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామాల కార్యదర్శులతో కలిసి గ్రామాల్లో ప్రధానంగా అవసరమైన అభివృద్ధి పనులైన డ్రెయినేజీ, తాగునీరు, రోడ్లు తదితరుల అంశాలపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల గ్రామ సభలు నిర్వహించి ఏకాభిప్రాయం లేకుండా కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. దాని వల్ల ప్రధానంగా అవసరమైన అభివృద్ధి పనులు వెనుకబడే అవకాశం ఉందన్నారు. అభివృద్ధికి తాము ఆటంకం కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఎఇ నరసింహులు మాట్లాడుతూ... గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ కోసం ప్రభుత్వం నుంచి రూ.2.5 కోట్లు మంజూరు చేయాలని నివేదించామని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సి.విశ్వనాథ్ రెడ్డి, జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, అంజినయ్య, ముక్కరన్న, ఎంపిటిసి వెంకటేష్, రామాంజినేయులు, ఇఒఆర్‌డి ప్రభావతి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జాబ్ మేళా గురించి వివరిస్తున్న టిడిపి నాయకులు

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో 17 కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 482 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. వీరిలో 204 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నాయకులు ప్రతాప్, ఉరుకుంద శెట్టి, ఈడిగ రంగస్వామి గౌడ్, ముల్లా కలీముల్లా, చేనేత మల్లికార్జున, మిన్నప్ప, కటారి రాజేంద్ర, బందే నవాజ్, సాబీర్, ధామ నరసింహులు, బోయ రాజు, బచ్చాల రంగన్న, గాజుల సుధాకర్, సలీం, మాల నాగేష్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల అగ్రనేత ఏచూరి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా పోరాటాల అగ్రనేతగా సీతారామ్ ఏచూరి చిరస్థాయిగా మిగిలిపోతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా సీతారామ్ ఏచూరి చిత్రపటానికి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవి శెట్టి ప్రకాష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి, సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఏచూరి విద్యార్థి దశ నుంచే మార్క్సిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారని తెలిపారు. నాటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని, తుదిశ్వాస వరకు ఆ బాధ్యతలో ఉన్నారని వివరించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, లౌకికవాదాన్ని కాపాడుకోవడం కోసం, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం జరిగే పోరాటాలకు దిక్సూచిగా సీతారాం ఏచూరి నిలిచారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, ఉచ్చీరప్ప, నాయకులు వీరేష్, వెంకటేశులు, ఖాన్, నాగరాజు, కృష్ణమూర్తి, వెంకటేష్, నాగేంద్ర, తిక్కప్ప, తిక్కన్న, కృష్ణమూర్తి, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

రంగన్నను పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం...

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టిడిపి సీనియర్ నాయకులు కోసిగికి చెందిన నాడిగేని రంగన్నను పరామర్శించి, అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి భరోసా ఇచ్చారు. రంగన్న అనారోగ్య విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం కర్నూలులోని అశ్విని హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. పార్టీకి రంగన్న చేసిన సేవలను నాయకత్వం గుర్తుంచుకుంటుందని తెలిపారు. రంగన్న ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్‌రెడ్డి, కోసిగి ఎంపిటిసి నాడిగేని మహాదేవ, నర్సమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాయినాథ్

ప్రజాశక్తి - ఆదోని

విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేసే కార్మికులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయినాథ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో పని చేస్తున్న తాత్కాలిక కార్మికులను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పడుతూ ఆందోళనకు దిగుతామని పిసిసి అధ్యక్షులు షర్మిల హెచ్చరించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించి అయినా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ఉద్యమానికి పిలుపు ఇచ్చారని చెప్పారు. పిలుపు ఇచ్చిన రెండు రోజుల్లోనే స్టీల్ ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చి 4200 మంది కాంట్రాక్టు కార్మికులను కొనసాగించేందుకు అంగీకరించిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ విజయంగా భావిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల కోసం ఎంతటి పోరాటానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, ఆదోని పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎంపిడిఒ, ఇఒఆర్‌డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్ ఎంపిడిఒగా రాణెమ్మ, ఇఒఆర్‌డిగా ఈశ్వరయ్య శుక్రవారం పరిషత్ సిబ్బంది సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. మండలంలో పంచాయతీల అభివృద్ధికి సేవలు అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. మండలంలోని విష్ణుసేనా నాయకులు పోలకల్ అమర్, సోమన్న అధికారులకు పూలమాలలతో స్వాగతం పలికారు.

ఆదోనిలో భారీ వర్షం...

- ప్రధాన రహదారులు జలమయం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా గంటన్నరసేపు భారీ జల్లులతో కూడిన వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులు, ఆయా కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికి తోడు శుక్రవారం తెల్లవారుజామున సైతం పట్టణంలో భారీ వర్షం కురిసింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ప్రధాన రోడ్డులోనూ, కాలనీలోనూ రోడ్డుపై ఉంచిన వాహనాలన్నీ నీట మునిగాయి. మిట్ట మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిన గ్రామీణ ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షం గంటన్నర సేపు కురిసి తగ్గడంతో నీరు భారీగా చేరింది. పట్టణంలోని శ్రీనివాస్ భవన్ సర్కిల్, భీమాస్ సర్కిల్, ఎంఎం రోడ్డు, పిఎన్ రోడ్డు, ఝూన్సీ లక్ష్మీ మార్కెట్ ప్రాంతం, ప్రభాకర్ టాకీస్ ప్రాంతం జలమయమైంది. భారీగా వర్షపు నీరు రావడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్డుపై ఉంచిన ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. అలాగే ఇతర వస్తువులు సైతం వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. ప్రధాన రహదారిలోనే నడుము లోతు వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ముఖ్యంగా పాత ఓవర్ బ్రిడ్జి నుంచి భీమాస్ సర్కిల్ వరకు మున్సిపల్ ప్రధాన రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతోను, రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు చేయడంతోను, నడుము లోతు వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఉండడంతో ప్రజలు దుకాణాల నుంచి బయటికి రాలేకపోయారు. అరగంటసేపు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ కార్యాలయం ఆవరణమంతా నీరు నిలవడంతో అక్కడ నిలిపిన చెత్త తరలింపు వాహనాలు మునిగిపోయాయి. వర్షపు నీరు వెళ్లేందుకు మున్సిపల్ కార్యాలయం ముందు కాలువలు లేకపోవడంతో ఆవరణమంతా నిండిపోయింది. కార్యాలయంలో ఉన్న ఉద్యోగులు బయటకు వచ్చేందు కు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. అధికారులు నీరు బయటకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం ముందు నిలిచిన వర్షపు నీరు

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

పిడుగు పడి ఐదు మూగజీవాలు మృతి

ప్రజాశక్తి - కౌతాళం

ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో పిడుగు పడి ఐదు మూగజీవాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని బదినేహాలు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముల్లా పెద్ద బందేనవాజ్‌కు చెందిన నాలుగు మేకలు, ఒక పొట్టేలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ముల్లా పెద్ద బందే నవాజ్ భార్య మహాబీ జీవాలను మేపేందుకు పొలాల వైపు వెళ్లారు. వర్షం కురవడం ప్రారంభం కావడంతో ఆ జీవాలు చెట్టు కిందికి చేరాయి. ఉరుములతో కూడిన పిడుగు పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిని మేపడానికి వెళ్లిన మహాబీ దూరంగా ఉండడంతో ప్రమాదం తప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధనలక్ష్మి అలంకారంలో మంచాలమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో ఉన్న గ్రామ దేవత మంచాలమ్మ ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారికి నిర్మాల్యం చేసి పసుపు కుంకుమలతో, పుష్పహారాలతో పాటు కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం దూప, దీప నైవేధ్యాలతో మంగళ హారతులు ఇచ్చారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు అమ్మవారిని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు.

షాప్ ఛైర్మన్‌ను కలిసిన మారుతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (SAAP) ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన రవి నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆదోని తెలుగు యువత నాయకులు మారుతి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గురువారం విజయవాడలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశానన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చంద్రబాబు ఆశయాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి ఎంపిడిఒగా సుహాసినమ్మ, ఇఒఆర్‌డిగా రవి కిషోర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సుహాసినమ్మ హోళగుంద నుంచి వెల్దుర్తి ఎంపిడిఒగా, రవి కిషోర్ కల్లూరు నుంచి వెల్దుర్తి ఇఒఆర్‌డిగా బదిలీపై వచ్చారు. సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చారు.

గాలిమరల కేంద్రాలపై దాడులు తగదు

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నియోజకవర్గం పరిధిలోని మొలగవల్లి, జోహారాపురం, జిల్లేడుబుడకల గ్రామాల్లో విండ్ పవర్ కంపెనీలపై వైసిపి నాయకులు దాడులు చేయడం తగదని జన సేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వెంకప్ప తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాలి మరల విద్యుత్ సబ్ స్టేషన్లలో చాలా మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం వారికి పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉపాధి కల్పిస్తున్న కంపెనీలను ప్రోత్సహించాలని తెలిపారు. నాయకులు అక్రమ సంపాదన కోసం వసూళ్లకు పాల్పడకూడదని, అది ఎవరు చేసినా తప్పు అని చెప్పారు. నాయకులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి మారి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గమేషా, రీన్యూ కంపెనీలకు అండగా ఉండాలని, ఆలూరులో జరుగుతున్న సమస్యలను త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన నంద్యాల నాగేంద్ర

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించే

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు అల్తాఫ్ బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మండల నాయకులు వీరేంద్ర, వినయ్ నాయుడు, మునిస్వామి, అభి పాల్గొన్నారు.

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎంపిడిఒగా టి.అల్లాప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఆయనకు స్వాగతం పలికి, శాలువా వేసి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఆలూరులో విధులు నిర్వహిస్తున్న తాను సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరికి వచ్చినట్లు అల్లాబకాష్ తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అందరికీ తాను సుపరిచితుడేనని, విధుల్లో పారదర్శకంగా పనిచేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల్లో అలసత్వం వహించకుండా సమయానికి కార్యాలయాలకు వెళ్లేలా చూసుకోవాలని ఆదేశించారు. పలువురు సర్పంచులు ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎపిఒ మాధవ శంకర్, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, నరేంద్ర, జైరామ్ నాయక్, సురేంద్ర, సుధీర్, నరసింహులు, రామాంజనేయులు, ప్రమీల, శ్రీప్రియ, శ్రీదేవి పాల్గొన్నారు.

గోనెగండ్ల : సమన్వయంతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిడిఒ మణిమంజరి తెలిపారు. గోనెగండ్ల ఎంపిడిఒగా శుక్రవారం ఆమె విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా పాణ్యం మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో మంత్రాలయం ఎంపిడిఒగా పనిచేస్తున్న మణి మంజరి గోనెగండ్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మండలంలోని ప్రజాప్రతినిధులు, సిబ్బందితో పరస్పర సమన్వయం చేసుకొని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గోనెగండ్లలో స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ఇఒఆర్‌డిగా అనంత శయన

ఇఒఆర్‌డిగా పనిచేస్తున్న నగేష్ బదిలీపై వెళ్లడంతో నూతన ఇఒఆర్‌డిగా అనంత శయన విధుల్లో చేరారు. గాజులదిన్నె గ్రామానికి సుభాన్, పుట్టపాశం మద్దిలేటి, వెముగోడుకు ఆనంద్ పంచాయతీ కార్యదర్శులుగా చేరారు. ఎఒ బాబు భాస్కర్, సిబ్బంది రహిమాన్, ఎపిఒ మహ్మద్ బాష, ఈసి ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శులు టి.వెంకటేష్, సతీష్, బి.వెంకటేశ్వర్లు, రామదాసు పాల్గొన్నారు.

మంత్రాలయం : మంత్రాలయం ఎంపిడిఒగా శోభారాణి, ఎఒ రాధ బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో బదిలీ అయిన ఎంపిడిఒ మణిమంజరి ద్వారా బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా నందికొట్కూరులో పని చేస్తున్న శోభారాణి మంత్రాలయానికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న మణిమంజరి గోనెగండ్ల మండలానికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా ఇక్కడ ఎఒగా పనిచేస్తున్న అమరేంద్రుడు నందికొట్కూరుకు బదిలీ కావడంతో దొర్నిపాడు మండలంలో పనిచేస్తున్న రాధ మంత్రాలయం మండలానికి బదిలీపై వచ్చారు. మంత్రాలయం ఎంపిడిఒగా, ఎఒగా బాధ్యతలు చేపట్టిన శోభారాణి, రాధలు ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మంత్రాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర ఉద్యమాలు

- సిపిఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమాలు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు తెలిపారు. శుక్రవారం 11వ వార్డు ఎర్రబురుజులో మహాసభలు ఎం.పెద్ద సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్ఎమ్‌డి.షరీఫ్, డి.అబ్దుల్‌దేశాయ్ మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదని విమర్శించారు. హామీలు అమలు చేయకపోగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపిందని తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' అని టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు చెబున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలు, ధరలు పెంచడమే మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్క పెన్షన్ స్కీమ్ తప్ప మరొకటి అమలు చేయలేదని తెలిపారు. సిపిఎం కార్యకర్తలు ప్రజల్లో మమేకమై ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం బూటకపు పథకాలపై చర్చపెట్టి ప్రజలను సమీకరించి ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. అనంతరం నూతన కార్యదర్శి గా ఎం.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. సిపిఎం సీనియర్ నాయకులు డి.పార్వత య్య, నగర నాయకులు ఎం.మణి కుమార్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింతామణి నాటకం నిషేధం ఎత్తేయాలి

- రంగస్థల కళాకారుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజాదరణ పొందిన 'చింతామణి సాంఘిక నాటకం' నిషేధాన్ని ఎత్తేయాలని రంగస్థల కళాకారులు కోరారు. శుక్రవారం రోజా వీధి మహిళా సంఘం అధ్యక్షులు మీసాల సుమలత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చింతామణి నాటకాన్ని గత ప్రభుత్వం నిషేధించడం వల్ల రంగస్థల కళాకారుల ఉపాధికి గండి పడిందని తెలిపారు. చింతామణి నాటకం ప్రదర్శించి జీవనం గడుపుకునే రంగస్థల కళాకారులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. సమ సమాజంలో నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సాంఘిక నాటకాలు దోహదపడుతున్నాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బాధ్యతాయుతంగా సమాజంలో మెలగాలని చింతామణి నాటకం సందేశం, సుబ్బిశెట్టి కొన్ని సన్నివేశాలను తొలగించినప్పటికీ చింతామణి నాటక ప్రదర్శనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతులు ఇవ్వాలని కోరారు. టిడిపి సాంస్కృతిక వ్యవహారాల జిల్లా అధ్యక్షులు పెరికలపాటి హనుమంతరావు చౌదరి, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీవుల్లా, రాష్ట్ర సమాచార హక్కుల పరిరక్షణ వేదిక కార్యదర్శి ఎన్‌కె.జయన్న పాల్గొని చింతామణి నాటకాన్ని ప్రభుత్వం ప్రదర్శన చేపట్టాలని కోరారు. మల్లె పోగు ఆంజనేయులు, నాగన్న, షాలుమియా, శేషమ్మ, బీసమ్మ, నారాయణమ్మ, లలితమ్మ, ఫాతిమాబి పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో చేపట్టనున్న

సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని మొట్టివీధిలో రూ.10 లక్షలతో చేపట్టనున్న డ్రెయినేజీ, సిసి రోడ్డు పనులకు మేజర్ పంచాయతీ సర్పంచి హైమావతి, టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం మండలానికి రూ.2 కోట్లు, మేజర్ పంచాయతీకి రూ.47 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా గోనెగండ్ల మొట్టి వీధిలో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.10 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులను ప్రారంభించామని చెప్పారు. మిగతా పనులను కూడా త్వరలోనే చేపడతామని తెలిపారు. టిడిపి నాయకులు ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసా, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచులు రహమతుల్లా, రంగముని, రమేష్ నాయుడు, శ్రీధర్ నాయుడు, రంగస్వామి నాయుడు, ఎస్.షేక్షావలీ, పూజారి చంద్ర, గౌవుండా రహమతుల్లా, రాంపురం రంజాన్, ఎ.మిన్నెల్లా, అక్బర్ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న నాయకులు

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నందవరం

కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ధర్మపురం చెక్‌పోస్ట్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా కారులో కర్ణాటక మద్యం తరలిస్తున్న వెంకటేష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన దగ్గర నుంచి 960 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వెంకటేష్ రాయచూరు జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలిపారు. అనంతరం వెంకటేష్‌ను, కారును అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

IN THE COURT OF THE HON'EBLE PRINCIPAL DISTRICT JUDGE: KURNOOL
O.S.No.13 /2024
BETWEEN :
Sri.KOGURU SURESH BABU & others
... Plaintiffs
-Vs-
Sri, KOGURU BASAMMA & Others
... Defendants
SUMMONS TO DEFENDANT No . 4
To,
KOGURU PADMAVATHI D/o Late Koguru Kannaiah, H.No. 64-30, Chidamnbara Rao Lane, Kurnool City & District.
Whereas the above named Plaintiffs filed Suit against you UNDER ORDER VII RULEI OF C.P,C in the above Court and the same is posted to 18-10-2024 for your appearance.
You being the Defendant No.4 in the above case is hereby summoned by way of this publication to appear before this Hon 'ble Court on 18-10-2024 at about 10.30 A.M in person. If you fail to appear before this Court on 18-10-2024 at about 10.30 A.M, The Hon'ble Court follows next step and decide the matter in your absence.
By Order of the HON'BLE PRINCIPAL "DISTRICT JUDGE,
Hearing Date: **18-10-2024**
Sri.A.RAJENDRA PRASAD
Smt.S.A.INDUMATHI
ADVOCATES FOR PLAINTIFFS
Kurnool.